# సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం, 25, అక్టోబర్, 2023




**మరణంలోనూ భర్త వెంటే!**

జి.కొత్తకోట మండలం మొగసాలమర్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ మృతిచెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. -8లో



**తెలుగు తమ్ముళ్ల ఓవరాక్షన్**

టీడీపీ నాయకుల ఓవరాక్షన్‌తో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్గాలుగా వేరుపడి మూడుచోట్ల దీక్షలు చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి. -8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**



| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.160 | రూ.220 |
| రెండోరకం | రూ.80 | రూ.158 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 371 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**



| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 505 | 505 |
| సీబీ | - | - |

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 80.100 కిలోలు

# వైభవం.. శమీదర్శనం



శమీదర్శన ఉత్సవంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఉత్సవ మూర్తి



బాణసంచా పేలుళ్ల వెలుగుజిలుగులు

- వైభవంగా ముగిసిన దసరా ఉత్సవాలు
- ప్రొద్దుటూరులో కన్నులపండువగా సాగిన తొట్టి మెరవణి
- ప్రత్యేక ఆకర్షణగా సింగారిమేళం, వేషధారణలు

ప్రొద్దుటూరు కల్చరల్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరు పట్టణంలో సోమవారం సాయంత్రం శమీదర్శన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విజయానికి, సకలశుభాలకు, సిరిసంపదలకు చిహ్నమైన శమీ వృక్షాన్ని విజయదశమి రోజు దర్శించి పూజలు నిర్వహిస్తే శుభప్రదమని దశమినాడు ఈ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి ఉత్సవ మూర్తిని కన్నులవిందుగా పట్టు వస్త్రాలతో, పూలతో, పుత్తడి ఆభరణాలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకువచ్చి వాసవీ శమీవృక్ష మండపంలో శమీదర్శన మహోత్సవం చేయించారు. చెన్నకేశవాలయ దసరా ఉత్సవ కమిటీ, అగస్త్యేశ్వరాలయం రాజరాజేశ్వరీ ఉత్సవ కమిటీ, రాజరాజేశ్వరి ఆలయం, దత్తాత్రేయస్వామి, ఆత్మారామస్వామి, సత్యనారాయణస్వామి, విజయనగరంవీధిలోని చౌడేశ్వరీదేవి అన్ని ఆలయాల వారు కొర్రపాడు రోడ్డు మిల్లులోని శమీవృక్షం వద్ద దర్శనం చేశారు. కేరళ సింగారిమేళం, డిస్కోలైటింగ్, వేషధారణలు, డూప్ కళాకారుల నృత్యప్రదర్శన, బాణసంచా పేలుళ్లు, విద్యుత్ ఆర్చీల వెలుగులు, మంగళవాద్యాల సందడి శమీదర్శనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లక్షమంది పైగా భక్తులు శమీదర్శన మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించారు. కొందరు భక్తులకు ప్రసాద వినియోగం, మంచినీటి సౌకర్యం కల్పించారు.

**కన్నులపండువగా తొట్టిమెరవణి**

దేవీనవరాత్రుల సందర్భంగా విజయదశమిని పురస్కరించుకుని సోమవారం అర్ధరాత్రి వాసవీమాత తొట్టి మెరవణి ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవీనవరాత్రి ఉత్సవాల్లో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ తొట్టి మెరవణిలో వాసవీమాత శ్రీచక్రం ఉన్న పంచలోహ రథంపై (తొట్టిమెరవణి) భక్తులను కన్నులవిందు చేశారు. ఈ మహోత్సవం సోమవారం అర్ధరాత్రి మొదలై మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. పంచలోహరథంపై అమ్మవారు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చే ఈ వేడుకను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పుట్టపర్తి సర్కిల్‌లో బాణసంచా పేలుళ్లు, చెట్లు, రాకెట్లు, పాములు వంటి బాణసంచా పేల్చి విజయదశమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు.





ప్రొద్దుటూరు పుట్టపర్తిసర్కిల్‌లో భక్తులు (ఇన్‌సెట్) తొట్టిమెరవణిలో వాసవీకన్యకా పరమేశ్వరిదేవి

**ఘనంగా వసంతోత్సవం**



వసంతోత్సవంలో అమ్మవారు

స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం వాసవీమాతకు వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రంగు రంగుల పూలతో, గజమాలతో, పుత్తడి ఆభరణాలతో, నూతన పట్టు వస్త్రములతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని పుర వీధులలో అత్యంత వైభవంగా వాసవీ నామ స్మరణలతో ఊరేగించారు. దారి వెంబడి నీళ్లు చల్లుతూ భక్తులు అమ్మవారికి స్వాగతం పలికారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించి కాయకర్పూరం నైవేద్యంగా సమర్పించారు. డప్పువాయిద్యాల సందడి మధ్య భక్తులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు.



కేరళ సింగారిమేళం



కళాకారుల వేషధారణలు



విద్యుత్ కాంతుల దివిటీలు



కళాకారుల ప్రదర్శన

## న్యూస్‌రీల్

### 9న పురస్కారం



డీకే చదువుల బాబు

ప్రొద్దుటూరు: ప్రముఖ రచయిత, బాలసాహితీవేత్త, తెలుగు భాషోపాధ్యాయుడు డీకే చదువులబాబు నవంబర్ 9న న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోనున్నారు. ఈ విషయం తెలియజేస్తూ కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావు ఆహ్వానం పంపారు. చదువులబాబు రచించిన బాలల కథాసంపుటి 'వజ్రాలవాన' పురస్కారానికి ఎంపికైన విషయం తెలిసిందే.

### అట్టహాసంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీలు

బ్రహ్మంగారిమఠం: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని పలుగురాళ్ళపల్లె పంచాయతీ జి.కొత్తపల్లె సమీపంలోని కోడూరు దుర్గా దేవీ, బి.మఠంలోని అమ్మవారిశాల, ఈశ్వరీదేవి మఠం, బ్రహ్మంగారి మఠం తదతర దేవలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. మంగళవారం కోడూరు దుర్గాదేవి ఆలయంలో నిర్వాహకులు బండలాగుడు పోటీలను నిర్వహించారు. పొటీలలో మొదటి బహుమతి పొందిన వృషభ రాజములకు రూ. 80వేలు జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి అందజేశారు. రెండవ బహుమతి రూ. 60వేలు జౌకుపల్లెకు చెందిన బసిరెడ్డి జయరామిరెడ్డి కుమారులు, మూడవ బహుమతి రూ.50వేలు సింగల్‌విండో చైర్మన్ సుబ్బారెడ్డి, నాల్గువ బహుమతి రూ. 40వేలు బసిరెడ్డి కుమారులు విజేతలకు అందజేశారు.

# ఇంటి ముంగిట ఆరోగ్య ముచ్చట

ప్రభుత్వ వైద్యం ప్రజలకు మరింత చేరువైంది. ఊరిబయటో.. వీధి చివరో కాదు ఇంటి ముంగిటకు వచ్చి వాలింది. ఆధునిక పరికరాలతో.. అత్యాధునిక వైద్య సేవలతో కూడిన ప్రభుత్వ వైద్యం ప్రజల ఆరోగ్యానికి ఓ భరోసా ఇస్తోంది. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో వైద్య రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. విలేజ్ హెల్త్ క్లినిక్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, పీహెచ్‌సీలు.. ఒకటా రెండా అనేక రూపాల్లో వైద్య సేవలందిస్తూ వైద్య సేవకు కొత్త భాష్యం పలికింది.

- ప్రజల చెంతకు ప్రభుత్వ వైద్యం
- అందుబాటులోకి అత్యాధునిక పరికరాలు
- సమర్థవంతంగా ఆరోగ్యశ్రీ సేవలు

రాజంపేట: ఒకప్పుడు ప్రభుత్వాసుపత్రులకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితులు. అదికూడా సాధారణ జ్వరాలు వస్తే... జలుబు సోకితే అటువైపు వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. విష జ్వరాలు వచ్చినా.. ఇంకేదైనా అనారోగ్యపరిస్థితులు తలెత్తినా నేరుగా ప్రభుత్వాసుపత్రుల దిశగా అడుగులు వేస్తున్నారు. మందులు లేవని, బయట కొనుక్కోవాలని పరిస్థితులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లేకుండాపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యరంగానికి పెద్దపీట వేసింది. ఏ ఒక్కరూ వైద్యం అందక ఇబ్బంది పడకూడదని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాసుపత్రుల్లో పెద్దఎత్తున మౌళిక సదుపాయాలు కల్పించారు. అత్యాధునిక పరికరాలను ఏర్పాటుచేశారు. నాడు–నేడు పథకం ద్వారా మండల, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం జిల్లాలో 47 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, 11 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

**గడపవద్దకే వైద్యం**

ఒకప్పుడు బీపీ,షుగర్ రోగులు వైద్యపరీక్షలు కోసం దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. గర్భిణీలు పీహెచ్‌సీలకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితుల్లేవు. కుటుంబ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామానికి, తమ ఇంటికి సమీపంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు నెలలో రెండుసార్లు వైద్యులు వస్తున్నారు. అక్కడ వైద్య పరీక్షలు చేయడమే కాకుండా , నడవలేని మంచంలోనే ఉన్న రోగులకు ఇంటికే వైద్యులు వెళుతున్నారు. జిల్లాలో 104 సేవలకుగాను 33 వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. 32 వినియోగంలో ఉన్నాయి.





అత్యాధునికమైన డెలివరీ మంచాలు (ఇన్‌సెట్) పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

**జిల్లాలో వైద్య సేవలు ఇలా..**

| | |
|---|---|
| పీహెచ్‌సీలు : | 47 |
| యుహెచ్‌సీ : | 11 |
| వైఎస్సార్‌తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు: | 33 |
| విలేజ్‌హెల్త్ క్లినిక్: | 375 |
| సచివాలయాలు: | 501 |

**సిబ్బంది కొరతకు చెక్**

ఎన్నడూలేని విధంగా ఈ నాలుగేళ్లలో ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకాలు పెద్దఎత్తున చేపట్టారు. వైద్యులు, స్పెషలిస్టులు, స్టాఫ్‌నర్స్‌లు, పారామెడికల్ సిబ్బంది నియామకాలు జరిగాయి. 375 విలేజ్ హెల్త్‌క్లినిక్, 501 సచివాలయాలకు సిబ్బందికి పూర్తి స్థాయిలో ఉన్నారు.

**ఆరోగ్యశ్రీ సేవలు విస్తృతం:** ఆరోగ్యశ్రీ సేవలను మరింతంగా విస్తృతం చేశారు. ప్రపంచాన్ని వణికించిన కోవిడ్‌ను సైతం ఆరోగ్యశ్రీలో చికిత్సలు అందచేశారు. అంతేగాక డెంగీని సైతం ఆరోగ్యశ్రీలో చేర్చారు. ఈ ప్రభుత్వం రాకముందు 1150 ప్రొసీజర్స్ ఉండగా, ఇప్పుడు ఏకంగా 3, 500 ప్రొసీజర్స్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చి సేవలను మరింతం విస్తృతం చేశారు.

**పరికరం..అత్యాధునికం**



యుహెచ్‌సీలో అత్యాధునిక పరికరాలతో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైత గర్భిణీలకు స్కానింగ్ చేసేందుకు అత్యాధునిక స్కానింగ్ యంత్రాలను సమకూర్చారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ల్యాబ్ ఎక్విప్‌మెంట్లను అందచేశారు.

**అందుబాటులో వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు..**



హైరిస్క్ గర్భిణీలపై వైద్యసిబ్బంది నిరంతర మానిటరింగ్ చేస్తున్నారు. వారిలో హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి డెలివరీ తేదికి ముందుగానే వారిని ఆసుపత్రులకు తరలించేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. వారిని తరలించేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**మెరుగైన సేవలు**



జిల్లాలో ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం. ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. గర్భిణీలకు రకరకాల పరీక్షలు చేయిస్తున్నాం. హైరిస్క్ వారిని ప్రసవాల కోసం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను అందుబాటులో ఉంచాం. –డా.కొండయ్య, డీఎంహెచ్‌వో, అన్నమయ్య జిల్లా

**చాలా మంచి కార్యక్రమాలు**



రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో మంచి కార్యక్రమాలు చేస్తోంది. ఫ్యామిలీ డాక్టరు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయి. ఇంటింటి సర్వేలో ప్రజలు ఎలాంటి వ్యాధులతో బాధపడుతున్నారో గుర్తించి వైద్యసేవలు అందిస్తోంది. రోగులకు అన్ని రకాల వైద్యపరీక్షలు చేసి ఆసుపత్రిలో చికిత్సలు అవసరమయ్యే వారికి ఆరోగ్యశ్రీలో చేయడం మంచి పరిణామం. –పిల్లి పిచ్చయ్య, గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర కమ్యూనిటిహెల్త్ ఆఫీసర్ల సంఘం

### కోదండ రాముడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పల్లకిపై ఊరేగుతున్న సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో కొలువుదీరిన సీతారామలక్ష్మణులకు సోమవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో మూల మూర్తులకు పంచామృతాభిషేకం జరిపి, పట్టు వస్త్రాలు, తులసిమాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మూల మూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మధురై ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు



కడప కోటిరెడ్డి సర్కిల్: మధురై–ఓఖా మధ్య నడుస్తున్న మధురై ఎక్స్‌ప్రెస్ (09519)ను దారి మళ్లించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఈనెల 27వ తేదీ నుంచి ఈ రైలును దారి మళ్లించారన్నారు. ఈ రైలు రేణిగుంట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి మీదుగా నడ వాల్సి ఉండగా.. కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా ఓఖాకు నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు.

# జిల్లాలో ఐదు జనరిక్ ఔషధి కేంద్రాలు

- సహకార సంఘాల్లో ఏర్పాటుకు చర్యలు వేగవంతం
- 80 శాతం తక్కువ ధరకే అందనున్న జనరిక్ మందులు

పెద్దతిప్పసముద్రం: దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పుతోంది. రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి కేంద్రాల్లో వీటిని ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పల్లె ప్రజలకు తక్కువ ధరకే ఈ జనరిక్ మందులు అందుతాయి. అన్నమయ్య జిల్లాలోని పెద్దతిప్పసముద్రం, నిమ్మనపల్లి, దేవపట్ల, సరస్వతిపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార కేంద్రాలకు జనరిక్ ఔషధ కేంద్రాలు మంజూరయ్యాయి. అనంతంపల్లిలో వసతులు లేనందున అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఏ రోగానికైనా మార్కెట్‌లో లభించే మందుల ధరలతో పోలిస్తే ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాల్లో 80 శాతం తక్కువ ధరకే లభిస్తాయి. అన్ని రకాల మందులు ఇక పీఏసీఎస్ కేంద్రాల్లోనే ఉంటాయి. ప్రభుత్వాసుపత్రుల వైద్యులు జనరిక్ మందులు రాసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడమేగాక, ప్రభుత్వం వాటిని అందుబాటులోకి తెస్తోంది.



పెద్దతిప్పసముద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం

**మల్టీ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి**

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను మల్టీ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం. ఇందులో భాగంగా సొసైటీలకు షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్స్, గోదాములు మంజూరు చేస్తోంది. ప్రధానమంత్రి జనరిక్ ఔషధి కేంద్రాలను పీఏసీఎస్‌లలో ఏర్పాటు చేయడం శుభ పరిణామం – గురుప్రకాష్ రావు, డీసీవో, అన్నమయ్య జిల్లా

**పేదలకు సాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**



సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ఎంతో కృషి చేస్తోంది. సొసైటీ బ్యాంకుల్లో ఇలాంటి జనరిక్ మందులు లభిస్తే నిరుపేదలు, సామాన్యులకుఊరట కలిగి డబ్బు ఆదా అవుతుంది. –గణపతిరెడ్డి, పెద్దతిప్పసముద్రం మండలం

## క్లుప్తంగా

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**కురబలకోట :** మండలంలోని ఎర్రబల్లె పంచాయతీ బలకవారిపల్లెకు చెందిన బలక ఉమాశంకర్‌రెడ్డి (46) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపంతో ఈ సంఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముబీన్‌తాజ్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలు

**మదనపల్లె :** రోడ్డు ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి గుర్రంకొండ మండలంలో జరిగింది. చెర్లోపల్లి పంచాయతీ దిగువకొత్తవారిపల్లెకు చెందిన రామయ్య కుమారుడు సి.వెంకటరమణ (60) రోడ్డుదాటుతుండగా ఎదురుగా వచ్చిన కారు అతన్ని ఢీకొంది. ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య కోసం బాధితుడిని తిరుపతికి రెఫర్ చేశారు. గుర్రంకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కోడిపందేల స్థావరాలపై దాడులు

**నందలూరు (రాజంపేట):** మండలంలోని కుందా నెల్లూరు పరిసర ప్రాంతాల్లోని చెయ్యేరులో కోడిపందేల స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి రెండు కోళ్లు, ఎనిమిది మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని, రూ. 51,080లు నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో పోలీసులు మహేంద్ర వర్మ, రామకృష్ణ, చంద్రయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

### గడ్డివామి దగ్ధం



గడ్డివామిని చూపుతున్న గ్రామ వలంటీర్

**నిమ్మనపల్లె :** గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గడ్డివామి దగ్ధమై రైతు తీవ్రంగా నష్టపోయిన సంఘటన సోమవారం నిమ్మనపల్లె పెద్దమాదిగపల్లెలో జరిగింది. నిమ్మనపల్లె పెద్దమాదిగపల్లెకు చెందిన కొమ్ము వెంకటేష్ వలంటీర్‌గా పని చేస్తూ పాడిపశువులను పోషిస్తూ జీవిస్తున్నాడు. పశువుల మేత కోసం ఎండుగడ్డిని స్థానికంగా వామి వేసి ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమై దాదాపు 5 ట్రాక్టర్ల పశుగ్రాసం కాలి బూడిదైపోయింది. దీంతో దాదాపు రూ.50 వేలు నష్టం వాటిల్లింది. పోలీసు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

# మరణంలోనూ భర్త వెంటే!

- మొగసాలమర్రి రోడ్డు ప్రమాదంలో భార్య మృతి
- అంతకు కొద్ది గంటల ముందే భర్త మరణం
- దంపతుల మృతితో ఎర్రమద్దివారిపల్లెలో విషాద ఛాయలు



అన్నయ్య, మధుప్రియ (ఫైల్)



ఎర్రమద్దివారిపల్లెలో దంపతుల మృతదేహాలు

**బి.కొత్తకోట/కురబలకోట :** బి.కొత్తకోట మండలం మొగసాలమర్రి వద్ద బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో భర్త వి.అన్నయ్య (45) దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న అన్నయ్య భార్య మధుప్రియ (40) నీ వెంటే నేనూ అంటూ లోకం విడిచి వెళ్లింది. గాయపడిన మధుప్రియను కాపాడుకునేందుకు ఆదివారం రాత్రి తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కురబలకోట మండలం ఎర్రమద్దివారిపల్లెకు చెందిన అన్నమయ్య, మధుప్రియ దంపతులు ఉపాధి కోసం ఐదేళ్ల క్రితం బి.కొత్తకోటలో స్థిరపడ్డారు. పీటీఎం రోడ్డులో పానీపూరి బండి నడుపుకొంటూ జీవిస్తున్నారు. ఏడాది క్రితం కుమార్తె మానసకు పెళ్లిచేశారు. కుమార్తె ఒక్కతే కావడంతో భార్యాభర్తలు బి.కొత్తకోటలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో స్వగ్రామం ఎర్రమద్దువారిపల్లెలో ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా మొగసాలమర్రి వద్ద కారు ఢీకొనడంతో అన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన భార్యను చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో తిరుపతికి తరలిస్తుండగా తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు వద్ద మృతి చెందింది. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. గంటల వ్యవధిలో భార్యాభర్తలు మృతి చెందడంతో ఇద్దరి మృతదేహాలకు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో ఒకేసారి పోస్టుమార్టం నిర్వహించారు.

**భర్త మరణం తెలియకనే..**

ఆదివారం రాత్రి మొగసాలమర్రి వద్ద బైక్‌ను కారు ఢీకొనడంతో భర్త అన్నయ్య ఘటనాస్థలిలోనే దుర్మణం చెందాడు. ప్రమాదం జరగ్గానే భార్య అపస్మారక స్థితికి వెళ్లింది. ప్రమాదం జరిగిన తర్వాత భర్త మృతి చెందిన విషయం కూడా తెలియలేదు. శరీరంపై గాయాలు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని భావించారు. అయితే శరీరంలో రక్తప్రసరణకు సంబంధించిన సమస్య ఉత్పన్నమైనట్టు తెలిసింది. ఈ సమస్య వల్లే తిరుపతికి చేరుకోవడానికి ముందే మధుప్రియ మృతి చెందింది. తమ గ్రామం వద్ద జరిగిన ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందడంపై మొగసాలమర్రి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఒంటరైన కుమార్తె**

అన్నయ్య, మధు దంపతులకు మానస ఒక్కరే కుమార్తె. కుమారులు లేరు. ఇంటర్ దాకా చదివిన మానసకు ఏడాది క్రితం రాజంపేట మండలం ఈడిగపల్లెలో వివాహం చేశారు. కన్నవారు దూరం కావడంతో వారి ఒక్కగానొక్క కుమార్తె మానస దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లుతోంది. స్వగ్రామం ఎర్రమద్దివారిపల్లెలో ఆదివారం వీరి అంత్యక్రియలు జరిగాయి. పక్కపక్కనే వీరిని సమాధి చేశారు. వీరు అన్యోన్యంగా జీవించేవారు. ఎక్కడికెళ్లినా కలసి వెళ్లేవారు. ఒకరిని విడిచి మరొకరు ఉండేవారు కాదు. అమ్మా నాన్న ఇద్దరూ వెళ్లిపోయారు..ఇక నాకు పెద్దదిక్కు ఎవరమ్మా...అంటూ కుమార్తె మానస తల్లిదండ్రుల మృతదేహాల వద్ద రోదించడం చూపరుల కంట తడిపెట్టించింది. ఈమెకు తల్లిదండ్రులు ఇద్దరూ దూరమవడం అంతులేని వ్యథను మిగిల్చింది. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యకు యత్నించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట గ్రామానికి చెందిన రెడ్డిశేఖర్ భార్య పి.మధుశ్రీ(25) కుటుంబ కలహాల కారణంగా మంగళవారం విషద్రావణం తాగింది. కాగా ఆమె భర్త రెడ్డిశేఖర్ ఆర్మీలో పని చేస్తుండగా వీరికి ఓ పాప ఉంది. అదే విధంగా మదనపల్లె పట్టణం చంద్రాకాలనీ సచివాలయ వీధికి చెందిన శంకర్‌నాయక్ కుమార్తె ఎం.అరుణ(21) తండ్రి మందలించాడని పురుగుల మందు తాగింది. కురబలకోట మండలం బలకవారిపల్లెకు చెందిన చిన్నరెడ్డప్పరెడ్డి కుమారుడు బి.ఉమాశంకర్‌రెడ్డి(42) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగాడు. మదనపల్లె పట్టణం ముజీబ్‌నగర్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్ విఘ్నేష్ అలియాస్ సుమియా (25) తన ప్రియుడు నగదు, బంగారు తన వద్ద తీసుకుని తిరిగి తనపై దాడి చేసి కొట్టాడని, వేధింపులకు పాల్పడుతున్నాడని సోమవారం రాత్రి మనస్థాపం చెంది పురుగుల మందు తాగింది. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధింత పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అధునాతన అగ్నిమాపక వాహనం ప్రారంభం

**ప్రారంభించిన డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు**



అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్‌బాబు

**కడప అర్బన్ :** కడప అగ్నిమాపక కేంద్రానికి నూతనంగా మంజూరైన అధునాతన అగ్నిమాపక వాహనం (మల్టీపర్పస్ టెండర్)ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు కడపలోని అగ్నిమాపక కేంద్రంలో ప్రారంభించారు. గతంలో కడప అగ్నిమాపక కేంద్రంలో రెండు అగ్నిమాపక వాహనాలు ఉండేవి. గత ఏడాది వేంపల్లిలో అగ్నిమాపక కేంద్రం మంజూరు కావడంతో అక్కడికి కడప నుంచి ఓ వాహనాన్ని పంపించేశారు. దీంతో కడప నగరంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు కమలాపురం, రాజంపేట, మైదుకూరు, వేంపల్లి నుంచి అగ్నిమాపక వాహనాలను తీసుకుని వచ్చేవారు. ఈ క్రమంలో ఆస్తినష్టం ఎక్కువగా సంభవించేది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇటీవల 5 కొత్త వాహనాలను మంజూరు చేసిన సమయంలో ఓ అధునాతన అగ్నిమాపక వాహనాన్ని కడపకు కేటాయించారు. ఈ వాహనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మేయర్ మాట్లాడుతూ ఈ అధునాతన అగ్నిమాపక వాహనంలో 5వేల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంకర్‌తో పాటు, 500 లీటర్ల ఫోమ్ కాంపౌండు, 500 కిలోల డ్రైకెమికల్ పౌడర్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఇనపాల ధర్మారావు, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, అజ్మతుల్లాఖాన్, మల్లికార్జున, ఇతర నాయకులు, కడప అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోను ఎందుకు ఢీకొన్నారని ప్రశ్నించినందుకు..

- పిడి బాకుతో దాడి
- ముగ్గురికి గాయాలు



దాడిలో తీవ్రంగా గాయపడిన పవన్‌కల్యాణ్

**ప్రొద్దుటూరు క్రైం :** స్థానిక రామేశ్వరం రోడ్డులో ఆటోను బైక్ ఢీ కొన్న సంఘటనకు సంబంధించి ఘర్షణ చోటు చేసుకుంది. బైక్‌లో వెళ్తున్న యువకులు పిడి బాకుతో దాడి చేయగా ముగ్గురికి గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెకు చెందిన నాగేంద్రబాబు కుటుంబంతో పాటు వారి బంధువులైన వేంపల్లెకు చెందిన పవన్‌కల్యాణ్, శివ, రామాంజనేయులు, మహేష్‌లు దసరా పండుగ సందర్భంగా సోమవారం ప్రొద్దుటూరుకు వచ్చారు. అందరూ కలసి సాయంత్రం ఆటోలో రామేశ్వరం రోడ్డు మీదుగా పట్టణంలోకి బయలుదేరారు. ఈ క్రమంలో కొంత దూరం వెళ్లగానే ముగ్గురు వ్యక్తులు బైక్‌లో స్పీడ్‌గా వచ్చి ఆటోను వెనుక వైపున ఢీ కొన్నారు. డ్రైవర్ వెంకటేష్ ఆటోను ఆపి బైక్‌తో ఢీ కొట్టిన ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించే క్రమంలో అతనితో వారు వాగ్వాదానికి దిగారు. దీంతో ఆటోలో ఉన్న వ్యక్తులు సర్ది చెబుతుండగా ముగ్గురు యువకులు వారి వద్ద ఉన్న పిడి బాకుతో దాడి చేశారు. ఈ సంఘటనలో వెంకటేష్, పవన్‌కల్యాణ్, నాగేంద్రలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా తీవ్ర రక్త గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. వారిలో పవన్‌కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తీసుకెళ్లారు. బైక్‌పై వచ్చి దాడి చేసిన యువకులు పెండ్లిమర్రి మండలానికి చెందిన ప్రసాద్, బయన్న, భరత్‌లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

## పండగ పూట.. తెలుగు తమ్ముళ్ల ఓవరాక్షన్

- మూడువర్గాలుగా మూడు చోట్ల ముగ్గురు నాయకుల దీక్షలు
- ప్రజలను ఇబ్బంది పెట్టవద్దన్న సీఐ మాటలు బేఖాతర్
- నవరాత్రి ఉత్సవాల్లో కరపత్రాల విడుదల, నిరసన ప్రదర్శనలు



సీఐ మహబూబ్‌బాషాతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు

**మదనపల్లె :** దసరా పండుగ సందర్భంగా సంతోషంగా గడపాలనుకున్న ప్రజలు టీడీపీ నాయకుల ఓవరాక్షన్‌తో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పండుగ పూట త్వరగా ఇళ్లకు వెళదామనుకున్న వారికి వేళాపాళా లేకుండా చేస్తున్న నిరసన దీక్షలతో సహనం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. మదనపల్లె టీడీపీలోని వర్గవిభేదాలతో మూడు వర్గాలకు చెందిన నాయకులు మూడుచోట్ల ముగ్గురు నాయకులు దీక్షలు చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి. చివరికి నవరాత్రి ఉత్సవాల్లో ఆయా వీధుల్లో స్థానికులు ఏర్పాటు చేసుకున్న మండపాల్లోకి వెళ్లి టీడీపీ నాయకులు పార్టీ కరపత్రాలను ఆవిష్కరించి తమ నీచబుద్ధిని ప్రదర్శించారు. దేవుడి ఉత్సవాలకు రాజకీయరంగు పులమడం, వేడుకలను అవకాశంగా వాడుకోవడంపై ప్రజలు అసహ్యించుకున్నారు. సోమవారం టీడీపీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్, జైలులో ఉంచినందుకు నిరసనగా నిరసన ప్రదర్శనలు చేసేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటిరమేష్ అన్నమయ్య సర్కిల్‌లోని పార్టీ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఇటీవలే కొత్తగా పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బెంగళూరు బస్టాండులోని తన కార్యాలయంలో అనుచరులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇదిలాఉంటే తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి హోదాలో నిమ్మనపల్లె మండలానికి చెందిన ఆర్.జే.వెంకటేష్, రాటకొండ మధుబాబులు మాజీ ఎమ్మెల్యేలు నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొనకుండా తమకు తాముగా వేరు కుంపటి పెట్టారు. నిమ్మనపల్లె సర్కిల్‌లో సోమవారం సాయంత్రం ట్రాఫిక్‌ను అడ్డగించి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ట్రాఫిక్ జామ్ విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా అక్కడకు చేరుకుని పండుగ పూట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రదర్శన విరమించుకోవాలని కోరారు. దీనికి టీడీపీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి అయిన తమ నాయకుడిని అకారణంగా జైలులో పెట్టారని, ఆయన కష్టాల ముందు ఇవేమీ ఇబ్బందులు కావంటూ సీఐను నిలువరించే ప్రయత్నం చేశారు. దానికి ఆయన అరెస్ట్ విషయం న్యాయవ్యవస్థ చూసుకుంటుందని, నిరసన ప్రదర్శనలు చేయాలనుకుంటే అందరూ కలిసి ఒకచోట చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని, ముగ్గురు, మూడుచోట్ల చేస్తే తాము ఏ విధంగా బందోబస్తు నిర్వహించాలని ప్రశ్నించారు. పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉందని, పండుగ పూట సాయంత్రం గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పినా వినకుండా తమ పంతం నెగ్గించుకునే ప్రయత్నం చేశారు. ప్రజలు చీదరించుకున్నా, పండుగ ఉందని బతిమాలినా, తమకేమీ పట్టనట్లు జనసేన నాయకులతో కలిసి రోడ్డుపై కరపత్రాలను దగ్ధం చేశారు.

## పిచ్చికుక్క స్వైరవిహారం

**పలువురికి గాయాలు**



మైలా వెంకటసుబ్బయ్య వేలు కొరికేసిన పిచ్చికుక్క, గాయపడిన వంశీవర్ధన్‌రెడ్డి, నీహారిక తలపై గాయమైన దృశ్యం

**అట్లూరు :** ఓ పిచ్చికుక్క ఒకరిని కాదు ఇద్దరిని కాదు రెండు గ్రామాలను గడగడ లాడించిన ఉదంతం అట్లూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు మండల పరిధిలోని మణ్యంవారిపల్లి గ్రామంలోకి మంగళవారం మధ్యాహ్నం పిచ్చికుక్క ప్రవేశించింది. కనిపించిన మూగజీవాలను విచక్షణారహితంగా గాయపరచింది. అలాగే సుభాష్‌చంద్రారెడ్డి, వంశీవర్ధన్‌రెడ్డి, సుబ్రమణ్యం, నీహారికలను గాయపరిచింది. గ్రామస్తులు వెంబడించడంతో కమలకూరు గ్రామంలోకి ప్రవేశించి పాలకొలను రోశిరెడ్డి అనే వ్యక్తి ముక్కు కొరికేసింది. అలాగే మైలా వెంకటసుబ్బయ్య కుడిచేతి వేలును సగం పూర్తిగా తినేసింది. అంతటితో ఆగకుండా మరికొంతమందిని స్వల్పంగా గాయపరిచింది. గాయపడిన వారిని వెంటనే ఆయా గ్రామాల ప్రజలు బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే పదుల సంఖ్యలో పశువులను, గొర్రెలను, మేకలను, కుక్కలను కూడా గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు.

## మహిళపై దాడి

**లింగాల:** లింగాల మండలం దొండ్లవాగు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళపై అదే గ్రామానికి చెందిన హరిశివారెడ్డి అనే వ్యక్తి కర్రతో దాడి చేశాడు. దాడిలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సురేంద్రనాథ్‌రెడ్డి, హరిశివారెడ్డిలు పొలాల్లో వర్షపు నీరు ప్రవహిస్తుండటంపై తరచూ గొడవ పడేవారు. ఈ నేపథ్యంలో హరిశివారెడ్డి ఆదివారం రాత్రి సురేంద్రనాథ్‌రెడ్డి భార్య ఆదిలక్ష్మిపై దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### హత్య కేసులో నిందితుడి అరెస్టు

**బి.కోడూరు :** మండలంలోని అంకనగొడుగునూరు ఎస్సీ కాలనీకి చెందిన అన్నదమ్ములు కోడూరు విజయరావు, కోడూరు రాంబాబు ఈనెల 18న ఘర్షణ పడ్డారు. తీవ్రంగా గాయపడిన రాంబాబు తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 22వ తేదీ మృతి చెందాడు. పోలీసులు విజయరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

- 26 మంది అరెస్ట్
- రూ.14.66 లక్షల నగదు స్వాధీనం



అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

**ప్రొద్దుటూరు క్రైం :** ప్రొద్దుటూరు మండల పరిధిలోని ద్వారకానగర్‌లో పేకాట ఆడుతున్న 26 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 14.66 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ వివరాలను ఏఎస్పీ ప్రేరణాకుమార్ సాయంత్రం మీడియాకు వెల్లడించారు. ద్వారకానగర్‌లోని రామాలయం సమీపంలో గల మార్తల ఇంద్రసేనారెడ్డి ఇంట్లో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో మంగళవారం వేకువ జామున రూరల్ పోలీసులు, సెబ్ అధికారులు, కడప స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడిలో పేకాట ఆడుతున్న దర్గా చౌషన్‌బాషాతో పాటు 25 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న రూ. 14,66,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు.

**అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం**

అసాంఘిక కార్యకపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నట్లు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట జూదం నిర్మూలించడానికి ప్రజలు, రాజకీయనాయకులు పోలీసులకు చక్కటి సహకారం అందిస్తున్నారని చెప్పారు. ప్రజలెవ్వరూ చెడు వ్యసనాలకు లోను కావద్దని సూచించారు. సమావేశంలో రూరల్ సీఐ రమణారెడ్డి, సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



### కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన అనిల్‌కుమార్, జశ్వంత్

**బి.కొత్తకోట :** బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి బి.కొత్తకోట పీటీఎం రోడ్డులో జరిగింది. పీటీఎం మండలం బూర్లపల్లెకు చెందిన అనిల్‌కుమార్ (20), బి.కొత్తకోట మండలం వేమిలేటికోటకు చెందిన జశ్వంత్ (19)లు బైక్‌పై పీటీఎంరోడ్డు వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో పీటీఎం నుంచి బి.కొత్తకోటకు వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకులు ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనిల్‌కుమార్‌కు ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి 108లో తరలించారు. ఘటనపై పోలీసులు విచారించి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్‌జీఎఫ్ క్రీడా షెడ్యూలు విడుదల

– ఈనెల 27 నుంచి నవంబర్ 4 వరకు జిల్లాస్థాయి ఎంపికలు

**కడప స్పోర్ట్స్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి క్రీడాఎంపికలకు సంబంధించిన క్రీడా షెడ్యూలును విడుదల చేశారు. ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలోని వివిధ మైదానాలు వేదికగా అక్టోబర్ 27 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఈఓ వై. రాఘవరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, చైల్డ్ ఐడీ, పుట్టినతేదీ ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు తదితర సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

| తేదీ | క్రీడాంశం | వేదిక |
|---|---|---|
| 27-10-23 | నెట్‌బాల్ | జెడ్పీహెచ్‌ఎస్, రామనపల్లి, చెన్నూరు |
| 28-10-23 | స్విమ్మింగ్ | వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల, కడప |
| 28-10-23 | హాకీ | వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల, కడప |
| 28-10-23 | ఫుట్‌బాల్ | వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల, కడప |
| 28-10-23 | సైక్లింగ్ | కేంద్రీయ విద్యాలయ, కడప |
| 30-10-23 | బాల్ బ్యాడ్మింటన్ | డీఎస్‌ఏ మైదానం, కడప |
| 30-10-23 | బ్యాడ్మింటన్ | వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం, కడప |
| 30-10-23 | సెపక్‌తక్రా | డీఎస్‌ఏ స్టేడియం, కడప |
| 31-10-23 | త్రోబాల్ | జెడ్పీహెచ్‌ఎస్, నీలకంఠరావుపేట, రామాపురం |
| 31-10-23 | కరాటే | గౌరీశంకర్ హైస్కూల్, రైల్వేకోడూరు |
| 01-11-23 | టెన్నికాయిట్ | జెడ్పీహెచ్‌ఎస్, మాసాపేట, రాయచోటి |
| 02-11-23 | ఖోఖో | వై.వి.ఎస్.ఎం.హెచ్.ఎస్. ప్రొద్దుటూరు |
| 02-11-23 | వాలీబాల్ | జెడ్పీహెచ్‌ఎస్ అలీమాబాద్, రాయచోటి |
| 04-11-23 | బాస్కెట్‌బాల్ | విద్యామందిర్, కడప |
| 04-11-23 | కుడో | జెడ్పీ హైస్కూల్, మంగంపేట, రైల్వేకోడూరు |

## పోరుమామిళ్ల చెరువులో విద్యార్థి మృతి



మృతి చెందిన వసంత్‌రెడ్డి

**పోరుమామిళ్ల :** సరదాగా చెరువులో ఈతకు వెళ్లిన విద్యార్థి మృత్యువాత పడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఇంటర్ విద్యార్థి వసంత్‌రెడ్డి సోమవారం స్నేహితుని వెంట మండలంలోని తిరువెంగళాపురం వచ్చాడు. మంగళవారం పోరుమామిళ్ల చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందాడు.

వివరాలిలా ఉన్నాయి. మైదుకూరు గాంధీ నగరానికి చెందిన కొండా సుమంత్‌రెడ్డి గుంటూరు విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అదే తరగతిలో చదువుతున్న మనోజ్‌రెడ్డి మంచి స్నేహితుడయ్యాడు. మనోజ్‌ది తెనాలి. అతనితో కలసి తెనాలికి వెళ్లేవాడు. తెనాలిలో మనోజ్ మామ కొడుకు వసంత్ రెడ్డితో పరిచయం స్నేహంగా మారింది. మనోజ్, వసంత్‌లను దసరా సెలవులు ముగుస్తున్నందున సుమంత్ తన ఊరికి ఆహ్వానించాడు. సుమంత్ అవ్వగారి ఊరు తిరువెంగళాపురం. మనోజ్, వసంత్‌రెడ్డి ఆదివారం రాత్రి తెనాలి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం పోరుమామిళ్లలో బస్సు దిగి సుమంత్‌రెడ్డి అవ్వగారి ఊరు తిరువెంగళాపురం వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేశాక నలుగురైదుగురు పిల్లలు సరదాగా చెరువులోకి ఈతకు వెళదామని బయలు దేరారు. వసంత్‌కు ఈత రాదు. చెరువులో దిగి గుంతలో చిక్కుకోవడం గమనించిన స్నేహితులు కేకలు వేసి, ఊర్లోవారిని పిలిచారు. వారు వచ్చి అతన్ని బయటకు తీసేసరికే నీళ్లల్లో ఊపిరి ఆడక వసంత్ రెడ్డి(17) మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని విచారించగా వసంత్‌రెడ్డి తెనాలికి చెందిన భూపాల్‌రెడ్డి కుమారుడని, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు బయలుదేరి వస్తున్నారన్నారు. కేసు నమోదు చేసి విచారిస్తామన్నారు. ఇదిలా ఉండగా వసంత్ మృతితో భయపడిన సుమంత్ స్పృహ కోల్పోయాడు. అతన్ని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. మనోజ్ కూడా భయంతో మాట్లాడలేని పరిస్థితి. భూపాల్‌రెడ్డికి వసంత్ ఒక్కడే కుమారుడు.

## పాస్టర్ హఠాన్మరణం

**పోరుమామిళ్ల :** బొప్పాపురానికి చెందిన సిద్దవటం ఇశ్రాయేలు(40) అలియాస్ శ్రీనివాసనం సోమవారం సాయంత్రం హఠాన్మరణం చెందారని గ్రామస్తులు తెలిపారు. నరసాపురంలో పాస్టర్‌గా పనిచేసేవారని, పండుగకు బొప్పాపురం వచ్చి తిరిగి వెళుతుండగా గుండెపోటుతో కూలిపోయాడన్నారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని తెలిపారు. పాస్టర్ భార్య చంద్రలీల రెండేళ్ల క్రితం మృతి చెందింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ రఘునాథరెడ్డి విజ్ఞప్తి చేశారు.